వికలమైన మనస్సులా చిందరవందరగా వుంది అడివి. గమ్యం తెలియని ఆలోచనలా మెలికలు తిరుగుతోంది రోడ్డు. తెగించి నట్టు దూసుకుపోతోంది బస్సు.

బస్సులో చాలాసేపటి నుంచి చూపుల యుద్ధం జరుగుతోంది. అతను చూస్తాడు. ఆమె తల తిప్పుకుంటుంది. అతను చూపు మళ్ళిస్తాడు. ఆమె వోరగా చూస్తుంది. అతను చూపుల్తో నవ్వుతాడు. ఆమె నిర్లక్ష్యంగా కిటికీ అవతలికి చూస్తుంది. అతను చిన్నబుచ్చుకుంటాడు. ఆమె తలవంచుకుని వేలచూపు చూస్తుంది. రెప్పల మీదుగా అతని వైపు చూస్తుంది. అతను మళ్ళీ మూగ చూపుతో పలకరిస్తాడు. ఆమె ఖాతరు లేనట్టు తల తిప్పేస్తుంది ...

లేడీస్ సీట్‌లో ఆమె.

ఇవతల ఎడం వైపు కిటికీ సీటులో అతను.

ఈ తతంగం ఈపరికే బస్సులో కొందరి కంట బడక పోలేదు. ఆమె పక్కనే కూచున్న ఆడవాళ్ళు ధోరణిలో కళ్ళు అరమోడ్చి మగత నిద్రలో పడ్డారు.

బస్సు బయలుదేరినప్పుడే ఎక్కిందామె. ఆ తర్వాత మరో స్టేజీలో ఎక్కాడతను. ఆమెను గమనించిన వెంటనే ఉలిక్కిపడ్డాడు. బాధపడ్డాడు. ఇదైపోయాడు. అతన్ని చూసి ఆమె కలవరపడింది. బెదరలేదు. అస హ్యంగా చూసింది. అతని చూపుల్ని తట్టుకోవడమే మహా కష్టంగా అనిపిస్తోందామెకు. కండక్టర్ మహా శయుడు కూడా వీళ్ళిద్దరి ధోరణి గమనించకపోలేదు.

అయితే, బస్సు ప్రయాణాల్లో ఇట్లాంటివి సర్వ సాధారణం.

ఇటువంటివన్నీ పట్టించుకుంటే కండక్టర్లు ఉద్యోగం చెయ్యలేరు. అడివి దారి ఎంతకీ ఎడతెగడం లేదు. ఘాట్ సెక్షన్ దాటిపోయిన తర్వాత రోడ్డు తిన్నగా సాగింది. బస్సు మరింత వేగం పుంజుకుంది. మధ్యాహ్నం ఎండ చెట్ల మీద పచ్చగా మెరుస్తోంది. రోడ్డు మీద పాములా మెరుస్తోంది ఎండ. అతను ఎడతెగని ఆశతో అలుపెరుగని యోధుడిలా చూపుల తూటాలు పేలు స్తూనే వున్నాడు.

ఆమె సివరంతయినా ఖాతరు చెయ్యదు, నవ్వదు. అయితే ఒకటే వచ్చింది చిక్కు. నిగ్రహంగా వుండలేక పోతోందామె. అతన్ని పూర్తిగా గుర్తుపట్టనట్టు వుండాలని ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నమే బెడిసి కొడుతోంది.

పోయారు. బస్సు మళ్ళీ కదిలినప్పుడు అతను గమ నించాడు. లేడీస్ సీట్‌లో ఆమె పక్కన ఖాళీ అయి పోయిందిప్పుడు.

ఆమె కొంచెం కదిలి, పవిట నిండుగా కప్పుకుని బిగుతుగా చుట్టుకుని కిటికీ వారకి జేరగిలబడింది. కదిలి వెనక్కి పోతున్న ప్రకృతిని తిలకిస్తోందామె. తిలకిస్తోందేగాని, పులకించడం లేదు. ఆమె మనసులో ఏవేవో ఆలోచనలు సుడిగా, వడిగా, జడిగా కదులు తున్నాయి. ప్రకృతి వెనక్కి వెళ్తోంటే వెళ్ళిపోయిన కాలం గుర్తొస్తోందా? కాలచక్రం వెనక్కి తిరుగు తోందా? అతను చూసిచూసి ఒక నిర్ణయానికి వచ్చి నట్టు చప్పున సీట్లోంచి లేచి, ముసలాయన్ని దాటుకుని లేడీస్ సీటులో ఆమె పక్కన ఖాళీలో కొంచెం ఇవతలగా సీటు అంచున కూచున్నాడు. కండక్టర్ మహాశయుడు ఇది గమనించాడు. అయితే, బస్సు ప్రయాణాల్లో ఇటు వంటివి కూడా మామూలే. చూపుల సందేశాల్లో ఏ సంకేతాలు అందాయో, మన కెందుకు లెమ్మన్నట్టు మిన్నకున్నాడు కండక్టర్ మహాశయుడు. ఆమె ఉలిక్కి పడింది. అతనొచ్చి, తన పక్కనే కొంచెం ఎడంగా కూచోవడం చూసి ఆమె కనుబొమలు ముడివడ్డాయి. లోకం ఏమనుకుంటుందన్నట్టు అటూ ఇటూ చూసిం దామె. అతను ఇంకేమీ, పట్టనట్టు నిశ్చలంగా చూశా డామె వైపు. అప్పుడు ఆమె కూడా అతనివైపు సూటిగా చూడక తప్పలేదు. —"బాగున్నావా?" అన్నాడతను. పుట్టిన తర్వాత అదే మాట తొలిమాటగా మాట్లాడు




# అడివి

కోవల్వో

కాస్సేపు ఆమె వైపూ అతని వైపూ వోరగానే మార్చి మార్చి చూసి, ఆ తర్వాత మనకెందుకులే అన్నట్టు ఎవరి ధ్యాసలో వాళ్ళు పడ్డారు.

అతని పక్కనే వున్న ముసలాయన కళ్ళజోడు మీదుగా అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ పరి యించి చూసి సిదపకాలం, సిదప బుద్ధులూ అన్న కళ్ళు నిలకడగా వుండవు. చూపులు స్వతంత్రించినట్టు అతని వైపు పరుగుతీస్తాయి. ముక్కుపుటాలు అదురు తాయి. నుదుట చెమట పోస్తోంది. చెమట - బైట ఎండ వల్ల కాదు! అడివి రాను రాను కొంచెం పలచ బడింది. ఊరొచ్చింది. బస్సు ఆగింది. ఆరేడుగురు దిగి

తున్నట్టు. ఆమె ఉలకలేదు, పలకలేదు. ఏం చెయ్యాలో తోచని దానిలా పెదవి నొక్కుకుంటూ వుండి, తల తిప్పుకుంది. అతనే మాటలు కొనసాగించాడు. — "ఏన్నాళ్ళయిందో కదా ... నిన్ను చూసి ... ఒక్కదానివే వెళ్తున్నావు ... నీ అమ్మ రాలేదా? ... ఎక్కడి దాకా ప్రయాణం ...? పోనీ ... బావున్నావు కదూ? ..." మాటలు ఆమె చెవిన పడుతూనే వున్నాయి. ఆమె చూపు ప్రకృతి మీద వుంది. వెనక్కి జారిపోతోంది ప్రకృతి. అతని మాటలు కాలంలో జ్ఞాపకాన్ని వెనక్కి లాగి కొడుతున్నాయి. — మళ్ళీ చూస్తాననుకోలేదు తెలుసా? దూరబ్బంధువెవరో చచ్చిపోయారంటే ... వచ్చాను గాని ... ఇటువైపు ఎందుకొస్తాను ...? ఇంతకూ ... ఎక్కడున్నావు నువ్విప్పుడు ... నీ చిన్నమ్మ ఇంట్లోనా? ... ఆమె చప్పున తలతిప్పి, అతని వైపు చురుక్కున చూసి మళ్ళీ మునుపటిలాగే కిటికీ అవతలికి దృష్టి మరల్చింది. గొంతు తడారిపోయినట్టు నాలుక చప్పరించుకున్నాడతను. ఆమె ముఖం మీద చూపుల్ని సారించాడు. "— చిక్కిపోయావు తెలుసా నువ్వు ... పోనీలే ... నా తప్పేం లేదు ... ఎవరెవరో చెప్పిన మాటలు విన్నారు మీరు ... అంతా మీ మేనమామ చేసిందే కదా? ... ఆ మాటంటే మీ అమ్మ ఒప్పుకోదు ... ఆ మాటంటే నువ్వూ ఒప్పుకోవు ... పోనీలే ...




27-4-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

మీరూ మీరూ ఒకటే కదా? నేనే దుర్మార్గుణ్ణయి పోయి నాను ... ఎక్కడనుంటేనేంగానీ ..!" ఆమె వున్నట్టుండి ముఖం దించుకుంది. చేతుల్లో ముఖం పూడ్చుకుంది. ఏడ్చిందా? తెలియలేదు. కొద్ది క్షణాల్లోనే ఆమె తలెత్తి కళ్ళెత్తి చూసింది. కణకణమని మండుతున్నాయి ఆ కళ్ళు. "— చాలండీ ... ఇంకేం చెప్పొద్దండీ ... చాలు..!" అంది ఆమె యుగయుగాల దుఃఖ భారాన్ని ఆ కొద్ది మాటల్లో కప్పలేకపోతున్నట్టు. ఆ తర్వాత ఆమె ముఖంలోకి రోషం చిమ్ముకొచ్చింది.

"— సిగ్గూ లజ్జా వున్న మనిషయితే మళ్ళీ నాతో మాట్లాడరు. మా వాళ్ళకి బుద్ధి లేదా? నాకా మాత్రం బుద్ధి లేదా?... వద్దు... జన్మకి మీ జోలి తంటా నాకు వద్దు ... మీకూ ... మీకు ఎప్పుడో చెప్పాను — ఇప్పుడూ చెప్తున్నా ... కోటి నమస్కారాలు తండ్రీ ... బతకనియ్యండి మమ్మల్ని ఇట్లా అయినా ..!" ఆమె కళ్ళ నుంచి నెదిరిన బిందువు తుంపర్లుగా రాలింది.

"— మాట్లాడినా తప్పయిపోయిందా! ..."

అతని గొంతులో శక్తి కూడా హరించుకుపోతోంది.

"— నొద్దు - నొద్దు ..."

నొక్కి పట్టిన స్వరంలో విస్ఫారాన్ని తొక్కిపట్టే నట్టు కసిరిందామె —"పోనీ - నేనంటే నీకు ..."— ఛ ... మనిషి కాదు మీరు ..!" చివుక్కున తల అవతలికి తిప్పేసింది.

అతను బుసకొట్టాడు. వణికిపోయాడు. "— బుద్ధి రాలేదు నీకింకా ... ఎప్పటికీ బుద్ధిరాదు ... నీ ఖర్మ ఇంతే ... నా బ్రతుకూ ఇంతేలే ... ఎప్పటికైనా అను భవిస్తారులే ..."

"— మీరే ... అనుభవిస్తారు ..!" మెరుపు కొట్టినట్టు చురక అంటించిందామె చుర చుర చూస్తూ...

"— ఛీ ... నీతో మాట్లాడ్డమే పాపం ... మహా పాపం" ... అంటూ చప్పున లేచేశాడతను. క్షణంలో సగంలో అతనే మనుకున్నాడో! ఆమె చూస్తూనే వుంది. ఈ పాటికి చాలామంది వాళ్ళ వైపే చూస్తున్నారు. అతను చరచరమని వచ్చేసి గుమ్మం దగ్గర ఒక మెట్టు దిగి ...

"— ఆపండి ... దిగిపోతాను" అన్నాడు కండక్టర్‌తో. బస్సులోంచి అవతలికి చూశాడు కండక్టర్. అక్కడెక్కడా వూరు లేదు. అడివే. ఏ దారీ లేదు. అడ్డదారీ లేదు.



"— ఇక్కడెక్కడ దిగుతారండీ? "

"— ఇక్కడే - దిగిపోతాను — "

"— స్టేజీ లేదు — "

"— నేను దిగిపోవాలి ... ఆపండంతే! "

"— అలా ఎలా ఆపుతారయ్యా బస్సుని? ఏం పద్ధతి లేదనుకున్నావా మాకు ...?! "

"— ప్రాణం పోయినా ఆపరేనిటి?

ఆపండి దిగిపోతాను... "

"— మళ్ళీ ఎక్కుతావేమో ... "

"— చస్తే ఎక్కను ... "

"— ఈ అడివిలో ఎక్కడికయ్యా? "

"— నా ఇష్టం ... ఆపుతారా లేదా? ..."

ఆపకపోయినా దూకేసే వాడిలా డోర్ తెరవ బోయాడతను.

"— ఆగవయ్యా బాబూ ... హోల్డాన్? "

కీచుమంటూ ఆగింది బస్సు.

ఒక్క ఉదుటున దిగేసి, తలుపు ధడేల్న వేసేశా డతను.

అతను దిగిపోవడం చూసి ఆమె తలవంచుకుని, చేతుల్తో ముఖం మూసేసుకుంది.

ఏడవడం లేదా?

ఎవరికి తెలుసు?

ఎర్రటి ఎండ కింద నల్లటి చీకటి. నీడల్ని దాచిన అడివిలో అసహ్యంగా సాగిపోతున్న రోడ్డు మీద ఆవేశంగా దూసుకుపోయింది బస్సు ...